క్లుప్తంగా

పన్ను వసూళ్లలో అలసత్వం వద్దు

చీరాల టౌన్‌: గ్రామాల్లో ఉన్న పంట పొలాలకు సంబంధించిన నీటి తీరువా వసూళ్లను నెలాఖరు కల్లా పూర్తి చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్‌ కుర్రా గోపీకృష్ణ సూచించారు. శనివారం తహశీల్దార్‌ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్‌ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించి నీటి తీరువా వసూళ్లను గ్రామ రెవెన్యూ అధికారులు చేయాలన్నారు. రైతుల నుంచి వి. ధిగా నీటి తీరువాను వీఆర్వోలు సక్రమంగా వసూళ్లు చేసి నగదును బ్యాంకులో జమ చేయాలని సూచించారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అర్జీలను త్వరగా విచారించాలన్నారు. గ్రామ సచివాలయాల వీఆర్వోలు, పట్టణ వీఆర్వోలు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారం

చీరాల టౌన్‌: పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్ధవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ఉంచాలని ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం సూచించారు. శనివారం మండల పరిషత్‌ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్‌, డిజిటల్‌ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయాలను తనిఖీ చేసి పెండింగ్‌ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలని సూచించారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదారీగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ప్రజలకు అందించే సేవల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవోఆర్డీ రామకృష్ణ, ఏపీఎం మధు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్‌ అసిస్టెంట్లు, డిజిటల్‌ అసిస్టెంట్లున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



సిబ్బందికి వివరిస్తున్న వ్యవసాయాధికారులు

చీరాల రూరల్‌: వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే భూమిలో పోషకాలు ఏస్థాయిలో ఉన్నాయో తెలుసుకోవడం ముఖ్యమని బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని తోటవారిపాలెం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సుమతి, రైతులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



పాదచారులకు మజ్జిగ పోస్తున్న సీఐ సుబ్బారావు

చీరాల రూరల్‌: వాకర్స్‌ ఇంటర్నేషనల్‌, ఎస్‌ఆర్‌ అండ్‌పీఎం హైస్కూలు చీరాల వాకర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం మంచి పరిణామమని ఒన్‌టౌన్‌ సీఐ ఎస్‌.సుబ్బారావు అభినందించారు. శనివారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికోన్నత పాఠశాల, మహాలక్ష్మి అమ్మవారి చెట్టువద్ద ఏర్పాటు చేశారు. వాకర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, ఇస్తర్ల సుభాషిణి, చారుగుళ్ల గురుప్రసాద్‌, గ్రంధి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేతన వెతలు

- జీతాల కోసం పారిశుద్ధ్య కార్మికుల ఎదురుచూపులు
- ఆరు నెలలుగా జీతాల్లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గ్రామ పంచాయతీలో పేరుకుపోయిన చెత్తకుప్పల నిల్వలు

చీరాల టౌన్‌: వారు ఫ్రంట్‌ లైన్‌ వారియర్స్‌.. ప్రజలను రోగాల బారి నుంచి తప్పించి ఆరోగ్యంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులు వారు. కరోనా వంటి విపత్కర సమయాల్లో అంకిత భావంతో విధులు నిర్వహించిన వాళ్లు ప్రస్తుతం జీతాలు సక్రమంగా రాక ఇబ్బందులు పడుతున్నారు. అయినా పాలకులు, ప్రభుత్వం కనికరం కూడా చూపటం లేదు. ప్రతిరోజూ చెత్తను తీసే వారి బతుకుల మాత్రం మారడం లేదు. గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వ హయాంలో ఠంచనుగా నెలనెలా జీతాలు అందుకునే వారు ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో కడుపు నింపుకునేందుకు కష్టాలు పడుతున్నారు. నెలల తరబడి జీతాల రాక.. అప్పులు పుట్టక అల్లాడుతున్న పాలకులు, అధికారులు కనీసం కనికరం చూపడం లేదు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. చేసిన పనికి వేతనాలు నెలల తరబడి అందక నానా తంటాలు పడుతున్నారు. అయినప్పటికీ వారు విధులు నిర్వహిస్తున్నా పంచాయతీ, మండల స్థాయి అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కాని వారి ఆకలి వెతలను మాత్రం పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పారిశుద్ధ్య నిర్మూలన పనులు చేయాలని ఆదేశించే అధికారులు మాత్రం వారి కష్టానికి తగిన కూలీలు ఇవ్వడాన్ని మాత్రం మరిచారు. చాలీచాలనీ వేతనాలు పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు అనారోగ్య సమస్యలతో అల్లాడుతున్న పారిశుద్ధ్య కార్మికులపై కనీసం జాలి, దయ లేకుండా వ్యవహరిస్తున్నారు పాలకులు, అధికారులు, పారిశుద్ధ్య నిర్మూలన సక్రమంగా చేసే కార్మికులకు ఇచ్చే సబ్బులు, చెప్పులు, నూనెలు ఇవ్వకపోగా నెలంతా కష్టపడి పని చేసినప్పటికీ నెలకు ఇచ్చే జీతాలను కూడా ఇవ్వకపోవడంతో గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 65 మంది, వేటపాలెం మండలంలోని 9 గ్రామ పంచాయతీల్లో 60 మంది మొత్తం 135 మంది కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. 24 పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల్లో చాలా మందికి ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో అర్ధాకలితో అలమటిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను కేవలం చెత్తచెదారాల తొలగింపులతో పాటు, కార్యాలయం స్వీపర్లుగా, వాచ్‌మెన్లుగా కూడా వివిధ రకాల విధులను నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టర్లు ఇష్టారీతిన మాత్రమే కూలీలు అందిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు. మేజర్‌ గ్రామంలో నెలకు ఒక్కో పారిశుద్ధ్య కార్మికుడికి రూ.12.500, మైనర్‌ గ్రామ పంచాయతీల్లో రూ. 10వేల లోపు నెల జీతంగా ఇస్తున్నారు. అవి కూడా సక్రమంగా చెల్లించడం లేదు. అలానే ప్రతినెలా కార్మికుడికి 6 సబ్బులు, కొబ్బరి నూనె, ఏడాది రెండు జతల యూనిఫాం ఇవ్వాలి. అవి కూడా సక్రమంగా అందించిన దాఖలాలు లేవు. గతంలో పంచాయతీ రాజ్‌ జీవో ప్రకారం కూడా అధికారులు విధులు నిర్వహించడం లేదు. పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు సక్రమంగా అందిస్తున్నారో...లేదో చూడాల్సిన మండల, డివిజన్‌ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పంచాయతీ కార్మికుల పట్ల కపట ప్రేమలను చూపిస్తున్నారే తప్ప తమకు జీతాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీల్లో నెలల తరబడి జీతాలు రాక కార్మికులు అవస్థలు పడుతున్నా పట్టించుకోకపోవడం గర్హనీయమని పెరిగిన ఖర్చులతో కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే ఆరు నెలల జీతాలు ఇవ్వాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.



ధర్నా చేస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్‌)

వేతనాలు ఇవ్వకుంటే ఆందోళనలే

పారిశుద్ధ్య కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం దారుణం. పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం హేయమైన చర్య. ప్రభుత్వం, మండల, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వేతనాలు ఇవ్వాలి. లేకుంటే ఆందోళనలు చేస్తాం. పంచాయతీ ఆదాయాన్ని బట్టి తక్కువ వేతనం అందించడం దారుణం. కలెక్టర్‌ చీరాల్లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

– డి.నాగేశ్వరరావు, ఏఐటీయూసీ, చీరాల అధ్యక్షుడు

నిధులు లేకనే జీతాల చెల్లింపుల్లో జాప్యం

ఈవిషయమై చీరాల ఈవోఆర్డీ రామకృష్ణను వివరణ కోరగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇచ్చేది కాంట్రాక్టర్లు. పంచాయతీకి ఇస్తున్న ఆదాయం నుంచి వీరికి వేతనాలు ఇస్తారు. పంచాయతీలకు కొంత ఆదాయం లేకపోవడంతోనే కార్మికులకు జీతాల చెల్లింపుల్లో జాప్యం ఏర్పడింది. నిధుల లేకపోవడం, అన్నింటికీ సాధారణ నిధులను వాడటం వలనే జీతాలు సక్రమంగా అందించడం లేదు. పది రోజుల్లోపు పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇచ్చేలా కృషి చేస్తా. అలానే ఇంటిపన్నులు వసూళ్లు చేసి మండలంలోని గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటా.

– రామకృష్ణ, ఈవోఆర్డీ, చీరాల

బాలల హక్కులపై అవగాహన అవసరం



కారంచేడులో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ నేతాజీ

కారంచేడు: సమాజంలో ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు, బాలల హక్కులపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్‌ సమావేశపు హాలులో నిర్వహించిన అవగాహన సదస్సులో సిబ్బందితో మాట్లాడారు. మే 2వ తేదీ నుంచి జూన్‌ 10వ తేదీ వరకు గ్రామాల్లో 15–18 సంవత్సరాల వయస్సు కలిగిన కిశోర బాలికలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లో మహిళా పోలీస్‌ టీంకు కన్వీనర్‌గా ఉండి వారికి అవగాహన కల్పిస్తారని వివరించారు. సమ్మర్‌ క్యాంపుల ద్వారా బాలికలకు, వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పిస్తారన్నారు. సూపర్‌వైజర్లు సునీత, హిమబిందు, ఆశాలు, ఎంఎస్‌కేలు, వీఓఏలు పాల్గొన్నారు.

నల్ల బర్లీ పొగాకు సదస్సు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

చినగంజాం: నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న ఇంకొల్లులో నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని చినగంజాం, ఇంకొల్లు మండలాలోని గ్రామాలలో రైతు సంఘం నాయకులు కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. శనివారం ఇంకొల్లు మండలంలోని బీమవరం, చినగంజాం మండలం సంతరావూరు గ్రామంలో పర్యటించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ళ రామకోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, పలువురు నాయకులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన మోహనరావు

అద్దంకి: మోటరు బైకులు ఢీ కొట్టుకున్న ఘటనలో ఒక మోటారుబై కును నడుపుతున్న వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో శనివారం జరిగింది. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం దారంవారిపాలెం గ్రామానికి చెందిన బత్తుల మోహనరావు బైకుపై అద్దంకి వస్తున్నాడు. ఈ క్రమంలో బైకు మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని మోటరుబైకు ఢీ కొట్టడంతో మోహనరావు రోడ్డు సైడులోకి పడిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రుడిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కిశోర వికాసంతో ఆత్మ స్థైర్యం పెంపు



బల్లికురవలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్‌

బల్లికురవ: బాల్యవివాహాల నిరోధంతో పాటు.. కిశోరబాలికల్లో ఆత్మ స్థైర్యం నింపేలా ప్రచారం నిర్వహించాలని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు షేక్‌ మీరాభి, సలోమి, విజయనిర్మల తెలిపారు. మే 2 నుంచి జూన్‌ 15 వరకు జరిగే కిశోర వికాసంపై శనివారం బల్లికురవలో నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. 11 నుంచి 18 ఏళ్ల లోపు కిశోర బాలికలకు గ్రామాల వారీగా 20 మందిన ఒక గ్రూపుగా ఎంపిక చేయాలని వీరికి మహిళా పోలీస్‌, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు గ్రూపు లీడర్లుగా వ్యవహరిస్తారని వివరించారు. గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జి. రవితేజ మాట్లాడుతూ కిశోర బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకుంటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీఓ దాసరి సుమతి, ఎంవీ ఫౌండేషన్‌ కోఆర్డినేటర్‌ పి. హరిహరరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆరాధన కమిటీ ఎంపిక



ప్రచార పత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అద్దంకి: పట్టణంలోని కాకాని పాలెంలో గల శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో దేవస్థాన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పొన్న పల్లి బ్రహ్మానందం అధ్యక్షతన శనివారం సమావేశాన్ని నిర్వహించారు. మే 7న నిర్వహించనున్న వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవాలకు కమిటీ చైర్మన్‌గా ఉలవల పూడి రవికుమార్‌, వైస్‌ చైర్మన్‌గా చెన్నుపల్లి కోటిలింగాచారిని నియమించారు. ఆహ్వాన పత్రిక ఆవిష్కరించారు. చెన్నుపల్లి శ్రీనివాసాచారి, జాగర్లమూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఏకగ్రీవం



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

అద్దంకి: ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అద్దంకి యూనిట్‌ సర్వసభ్య సమావేశం శనివారం పట్టణంలోని గీతా మందిర ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశానికి షేక్‌ మస్తాన్‌ వహించారు. కార్యదర్శి నివేదికను టి.కష్ణయ్య సమర్పించగా, జమాఖర్చుల లెక్కలను కోశాధికారి మారం కోటేశ్వరరావు సభ ముందు వివరించారు. భవన నిర్మాణానికి ఆర్థికంగా సహకరించిన దాతలకు అసోసియేట్‌ అధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి ధన్యవాదాలు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని ముఖ్య అతిథి రావుల బాపయ్య చౌదరి సూచించారు. సర్వ సభ్య సమావేశ అనంతరం ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించారు. అద్దంకి యూనిట్‌ అధ్యక్షుడిగా అడుసుమల్లి అనంత కోటేశ్వర రావు, కార్యదర్శిగా నిమ్మరాజు నాగేశ్వర రావు, కోశాధికారిగా వారణాసి రఘురామశర్మ, అసోసియేట్‌ అధ్యక్షులుగా నర్రా గోపాలరావు, పల్లపు ఆంజనేయులు, గౌరవాధ్యక్షులుగా కె.దేవసహాయం, ఉపాధ్యక్షులుగా ఎ.ప్రభాకరరావు, పొన్నపల్లి బ్రహ్మానందం, పల్నాటి జయరాణి, ఆకుల చిన్నయోగయ్య, ఆర్గనైజింగ్‌ కార్యదర్శిగా మక్కెన వెంకటేశ్వర్లు, సహాయక కార్యదర్శులుగా పెండ్యాల అంకయ్య, ఆవుల చిన రామచంద్రా రెడ్డి, చేకూరి మోహనరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైభవంగా వీరాంజనేయ స్వామి తిరునాళ్ల



అలంకరణలో వీరాంజనేయస్వామి



పొంగలి పెడుతున్న భక్తులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

బల్లికురవ: మండలంలోని పెదఅంబడిపూడి గ్రామ సమీపంలోని చింతతోపులో వేంచేసిఉన్న వీరాంజనేయ స్వామి 42వ వార్షిక తిరునాళ్ల శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు జి. పవన్‌ కుమార్‌ శర్మచే ఉదయం 5 గంటల నుంచే స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, తమల పాకులతో అర్చన ప్రత్యేక అలంకరణ, చేపట్టారు. అంబడిపూడితోపాటు పరిసర గ్రామాలోని భక్తులు స్వామివారి సన్నిధికి చేరి పొంగళ్లు పెట్టి నివేదించి తమతమ మొక్కులు తీర్చుకున్నారు. అనేక మొక్కుబడి ప్రభలు స్వామివారి సన్నిధికి చేరాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణతోపాటు సాయంత్రం కోలాట ప్రదర్శన, భారీ ఎలక్ట్రిక్‌ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

పథకం ప్రకారం పాఠశాలల మూసివేత

- ఎంఈఓ తీరుపై మాదిగ ఉద్యోగుల సంఘం ధ్వజం

మార్టూరు: మండలంలోని కొన్ని ఎస్సీ కాలనీల్లోని ప్రభుత్వ పాఠశాలలను నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఎంఈఓ ఎంసీహెచ్‌ వస్త్రం నాయక్‌ పై కలెక్టర్‌, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు మాదిగల ఉద్యోగ సంఘం మండల నాయకులు తెలిపారు. స్థానిక విద్యా వనరుల కేంద్రం వద్ద మాదిగ ఉద్యోగ సంఘం నాయకుడు మాడుగుల కిషోర్‌ బాబు శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం జీవో నెంబర్‌ 117 కు సవరణలు చేస్తూ మూడు, నాలుగు, ఐదు తరగతులను పూర్వ ప్రాథమిక పాఠశాలలలో పునరుద్ధరిస్తూ అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే అన్నారు. అయితే మండలంలోని బబ్బేపల్లి, కోలలపూడి గ్రామాల ఎస్సీ కాలనీల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఈ నిబంధనలు పాటించకుండా ఒకటి, రెండు తరగతులను మాత్రమే కొనసాగిస్తూ మూడు, నాలుగు, ఐదు తరగతులకు అవకాశం కల్పించకుండా ఎంఈఓ తీసుకుంటున్న అనుచిత నిర్ణయాలను ఖండిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో బబ్బేపల్లి పడమర ఎస్సీ కాలనీలో నాడు నేడు పథకం ద్వారా పాఠశాలను లక్షల రూపాయలు వెచ్చించి అన్ని హంగులతో ఆధునికీకరించారని తెలిపారు. ప్రస్తుతం ఆ పాఠశాలను మూసివేసి దళిత విద్యార్థులకు విద్యా సౌకర్యం దూరం చేసే కుట్ర జరగబోతుందని ఆరోపించారు. బబ్బేపల్లి ఎస్సీ కాలనీలో పనిచేసే ఉపాధ్యాయురాలు అంగన్వాడీ కేంద్రం నుంచి వచ్చే విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్చుకోకపోగా ఆ పాఠశాలలో ఉన్న వారిని సైతం బలవంతంగా టీసీ ఇచ్చి సమీపంలోని హెచ్‌ఈ పాఠశాలకు పంపుతున్నట్లు గ్రామస్తులు ఆరోపించారన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఎంఈఓ వస్త్రం నాయక్‌ కు అర్జీ అందజేశారు.



అర్జీ అందజేస్తున్న మాదిగ ఉద్యోగ సంఘ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

30న మున్సిపాలిటీ సాధారణ సమావేశం

అద్దంకి రూరల్‌: అద్దంకి మున్సిపాలిటీ సాధారణ సమావేశం ఈనెల 30న బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక కౌన్సిల్‌ హాలులో నిర్వహిస్తున్నట్లు శనివారం చైర్మన్‌ ఎల్‌. ఎస్తేరమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు.

1326 బంగారు కుటుంబాలు

అద్దంకి: మండలంలో 1326 బంగారు కుటుంబాలుగా పి4 సర్వే ద్వారా గుర్తించినట్లు ఎంపీడీఓ శింగయ్య శనివారం తెలిపారు. కలెక్టర్‌ ఆదేశాల ప్రకారం 200–265 మంది మార్గదర్శిలను గుర్తించేందుకు సచివాలయ సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు. కమిటీల ద్వారా మార్గదర్శకులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

ఉగ్రవాద చర్యలు అమానుషం

చీరాల అర్బన్‌: కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ శనివారం చీరాల చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ ఆధ్వర్యంల పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పాటు చేశారు. చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు తులాబందు వెంకటసురేష్‌, చిన్ని లీలాధరరావు, వేముల చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



108 వాహనంలో మగ బిడ్డను ప్రసవించిన మహిళ మంజుల

చినగంజాం: మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామానికి చెందిన మహిళ బి. మంజుల శనివారం అర్ధరాత్రి 108 వాహనంలో ప్రసవించింది. ప్రసవ నొప్పులతో చీరాల ఏరియా వైద్యశాలలో చేర్చగా అక్కడి నుంచి రిమ్స్‌కు తరలించాల్సిందిగా వైద్యులు సూచించారు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో చినగంజాం అంబులెన్స్‌ సిబ్బంది పైలట్‌ కె. భాగ్యరావు ఆమెను ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో చినగంజాం ఫ్లైఓవర్‌ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి ఆమె నొప్పులు రావడంతో ఈఎంటీ ఎస్‌. రవిబాబు డెలివరీ చేయించారు. మహిళ మగబిడ్డను ప్రసవించి తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు.

ఉగ్రవాద చర్యలను ఖండించాలి

అద్దంకి రూరల్‌: జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గంలో ఉగ్రవాదులు చేసిన నరమేధాన్ని దేశంతా ముక్తకంఠంతో ఖండించాలని ఏపీయూడబ్ల్యూజే బాపట్ల జిల్లా అధ్యక్షుడు చెన్నుపాటి రాంబాబు అన్నారు. శనివారం స్థానిక బంగ్లారోడ్‌ లోని అంబేడ్కర్‌ విగ్రహం నుంచి బస్టాండ్‌ సెంటర్‌వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ధర్మవరపు దుర్గాప్రసాద్‌, జి. మురళీ, సీహెచ్‌ శ్రీనివాసరావు, నరశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతలకు సన్మానం

అద్దంకి రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వంచే ఉగాది పురస్కారాలు అందుకున్న పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, తేళ్ల అరుణ, వడలి రాధాకృష్ణ, నూనె అంకమ్మరావులను సృజన ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా సన్మానించారు. స్థానిక కమఠేశ్వరస్వామి దేవస్థానంలో సృజన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగభైరవ ఆదినారాయణ, నందిరాజు విజయ్‌కుమార్‌, వై. కొండారెడ్డి, శెట్లం చంద్రమోహన్‌, సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత భవిత



షబనాకు కేక్‌ తినిపిస్తున్న ఎంఈఓ అజయ్‌ బాబు



చినగంజాం: మెరిట్‌ విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఇంకొల్లు(చినగంజాం): కష్టపడి ఇష్టంతో చదివితే విద్యలో రాణించడం సులభమే అని మండల విద్యాశాఖాధికారులు బొల్లిముంత అజయ్‌కుమార్‌, శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఇంకొల్లు మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలో ఫస్ట్‌ ర్యాంక్‌ సాధించిన షేక్‌ షబనాను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. కష్టపడి చదివి 593 మార్కులు సాధించడం గొప్ప విషయం అని ఆమెను శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఆదర్శ హైస్కూల్‌ కరస్పాండెంట్‌ తోటకూర విజయభాస్కర్‌, ఉపాధ్యాయులు దీవి రమేష్‌ కుమార్‌, గోరంట్ల శ్రీనివాసరావు, భవనం కేశవ రెడ్డి, సునీల్‌, రవి, సీఆర్పీలు, షేక్‌ జాని బాషా తదితరులు పాల్గొన్నారు.

మెరిట్‌ విద్యార్థులకు అభినందనలు

చినగంజాం: పెదగంజాం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన 13 మంది ద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పుష్పగుచ్ఛాలు, స్వీట్స్‌, పెన్నులు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయులు బి. నాగేశ్వరరావు, బి. చెంచిరెడ్డి, పి. బ్రహ్మయ్య, ఎ. సుబ్బరాజు, ఎన్‌. రమణమూర్తి, పీడీ అనిల్‌ కుమార్‌, తదితరులు అభినందనలు తెలియజేశారు.